# తీయలేని కలుపు

శ్రీ పులికంటి కృష్ణారెడ్డి

"ముసలయ్య జోలికొస్తే ముసలం పట్టినట్టేగదా! ... మూతికి మీసమున్న మగవాడెవడైనాసరే!...ముందు నిలబడి మాట్లాడమను తెలుస్తుంది!'— గుండెల్లో నిండిన భావం కండ్లల్లో తొంగిచూచేసరికి, అసలే విశాలమైన కనుబొమలు హద్దులుదాట యత్నిస్తూ ఉంటే, అంతవరకు చెవులు వాలేసి భుజంమీద పడివుండిన తుండుగుడ్డ నిక్కబొడుచుకొన్న కొమ్ములవలె సుంగులు విడిచిన తలపాగా రూపాన్ని సంతరించుకొంటూ ఉంటే, అహం ఆహ్వానం పలుక, సవాలు చేసినట్లు నాలుగు వీధులు తిరిగి, ఆపై ఊరి నడిబొడ్డులో రావి చెట్టుక్రింద అచ్చుబండ సింహాసనముకాగా ఆసీనుడై, కాసేపు ఆలోచించి, ఆపై నాలుగు దిక్కులు అవలోకించి, ఎవ్వరూ కనబడక పోయేసరికి, ఆ వూళ్లో ఎవ్వరికీ మూతికి మీసమే లేనట్లు భావించి, ఇంటిదారిపట్టే ముసలయ్య— రాత్రి 'అచ్చుబండ' వద్ద మద్దిస్తం జరిగినప్పటినుండి ఏదో ధారబోసుకొన్నట్లు ముభావంగా తిరుగుతూ ఉంటే— ఆ పల్లెలో గుడిదగ్గర, మడిదగ్గర, గుంటకట్టపై పంచాయతీ కార్యాలయమనబడే గుడిసెదగ్గర, గుసగుసలాడుకొంటున్నారు ఎవరికి తోచినట్లు వారు! ఆ ఊళ్లో ఎవరికీ మూతికి మీసమే లేనట్లు ముసలయ్య యేమో భావించాడు కానీ, ఆ వూళ్లో అందరికీ మీసాలమీద మోజు! శిరిపిరెడ్డి చిన్నమరెడ్డి నిమ్మపండు నిలబెట్టుతాడట మీసాలపైన! నల్లమొమ్మోళ్ల నరిసిగాడు మీసంమీద చేయి అసలు క్రిందికి దించనే దించడట!! ఆ వూళ్లో అడుగుబెట్టి 'కామసాని పెద్దబ్బయిల్లెక్కడ?' అని అడిగితే మిడకరించే పిల్లవాడుకూడ 'బుజ్జిమీసాలాయన యిల్లు' అంటే— 'అట్లడగరాదా?' అని గొణుక్కొంటూ, 'యిటుపో!' అనిదారిచూపుతాడట! అలాంటి పల్లెలో ముసలయ్యలాంటి వ్యక్తికి కలిగిన భావన ఆలోచించవలసిందే! ఆరా తీయవలసిందే!'

* *

అమాయకత్వకు మారుపేరులా పేరుకపోయిన గుట్టలనడుమ, అంతకంటే అమాయకులకు ప్రవాసమైన ఆ పల్లెలో మంచికి మారుపేరు ముసలయ్య. సాధారణంగా ఈలోకంలో రోజూ పుట్టిన వాళ్లకంటే ఎక్కువగనే పోతున్నారు. అయితే పోయిన వాళ్లందరి చరిత్ర చరిత్రపుటల కెక్కడం లేదు, ఏ నూటికో కోటికో ఒక్కరిది తప్ప. చరిత్రపుటల కెక్కడమంటే ఈ లోకంలో పేరు ప్రతిష్ఠలు సంపాదించుకోవడం. ఈ సముపార్జనలో మానవాళిని స్థూలదృష్టితో చూస్తే రెండుతెగలుగ విభజింపవచ్చు. అందులో ఒక తెగ సిద్ధులు. మరొకతెగ సాధ్యులు. ఈ రెండవ కోవకు చెందుతాడు ముసలయ్య! లేకపోతే— 'నాలుగు బార్ల పొద్దెక్కింది. గొడ్లుకట్టుగూటానపడి ఒగిరిస్తున్నాయి. నీకేం పొయ్యేకాలమొచ్చిందిరా? ఇయ్యరవదాక యాడసచ్చినావురా ముసిలిగా!' అని పదిహేనేండ్లకు పూర్వము రాగలుతీస్తూ ఉండిన రమణి ఓర్తుక ముసలయ్యముఖం కంటపడడంతోటే ముసిముసినవ్వులు చిందబోస్తూ అటకమీది చాపతీసి పరుస్తూ, 'బొత్తుగా నల్లపూసలైపోయావుగద

ముసలన్నయ్యా!' అని కుశలప్రశ్నలు కురిపిస్తుంది వాడు—అంటే ముసలయ్యసాథ్యుడే!

'చంద్రలోకంలో మణుసులు దిగినారంట! అదెట్లా పొద్దిపడిండబ్బా!' అని ఒకరు సందేహాన్ని వ్యక్తపరిస్తే 'ఆఁ! వాడితాడు. చంద్రలోకంలేదు. గింద్రలోకంలేదు. దేశానికి ఉత్తరాన ఉండయంట. అవేందో కొండలు. వాటిపైనదిగి వాడు డంబాలు కొడుతూండే — పిచ్చినాయాలగుంపు!...ఆ మాటలు నమ్మతుండారు!' అని అంటూ తన పరిజ్ఞాన పటిమకు పొట్ట చెక్కలయ్యేటట్టు మరొక ప్రబుద్ధుడు నవ్వేచోట, ముసలయ్య ఉండడం తటస్థమై...'వాడు జాతోడు. ఎంతకైనా తగుదుడు. అనవసరంగా మీరెందుకు వాదులాడుకొంటారు బావా?' అని సమస్యను చాలా తేలికగా పరిష్కారంచేసి, అప్పటికి అదేదో సర్వసామాన్యమైన విషయంగా తీసుకొని తరలిపోయే ముసలయ్యను, కాసేపు ఆశ్చర్యాంబుధిలోముంచి, ఆపై కాసేపు ఆలోచింపచేసి, అడుగు కదపకుండా నిలబెట్టేది ఒక్కటంటే ఒక్కటే దృశ్యం! అది—మంచివాని మనసులా, మేధావికీర్తిలా వ్యాపించిన పండు వెన్నెల్లో...మిద్దింటి లక్ష్మమ్మ అయిదేండ్లనును మణ్ణి చంకనవేసుకొని, ఆపసోపాలుపడుతూ, యింటి ముంగిట పచార్లుచేస్తూ......'చందమామరావే! జాబిల్లిరావే!' అని గోరుముద్దలు తినిపించడం! ఎందుకంటే—సరిగమలుపాడే ప్రేపులకు రసోత్పత్తి కలిగించడానికి పిడికెడు మెతుకుల కోసం చేతపట్టిన జోలి తిట్లతోనిండగా, బ్రతిమలాడడానికే అలవాటు పడ్డ తనకు — ఏకలిగినవానియింట్లోనో కమ్మటి విందులో మనసులోని భావాలకు మధురమైన రూపాన్ని సంతరించే చూపులసయ్యాటలకు, చేతిలోని 'స్పూను' వయ్యారాలకు లంకె కుదరక, ఓ కుసుమకోమలి జారవిడిచిన మెతుకులు, ఒక జీవి క్షుధార్తిని ఉపశమింపచేస్తాయన్న భావనతోగాదు — సరిగా శుభ్రంచేయలేదని సాగదీస్తారన్న భయంతో వేరొక కష్టజీవి జాగ్రత్తగాతెచ్చి బయటపడనేస్తే...వాటికోసం పోటీపడడడంమాత్రం తెలుసు — అదికూడ కుక్కతో!

ఆ దృశ్యంలో ముసలయ్యకు పరకాయ ప్రవేశం జరిగినంతపనిఅయి, పరిసరాలనే మరచి నడివీధిలో నిలబడి పోతాడు. బిడ్డకు దృష్టి తగులుతుందేమోయని లక్ష్మమ్మ చల్లగా యింట్లోకి జారుకొంటుంది. కానీ పిల్లవాని పోరుపడలేకనో, లేదు—ముసలయ్య కండ్లు దృష్టికండ్లుకావని తేలడంతోనో ఈ మధ్య లక్ష్మమ్మ ముసలయ్యను చూస్తే యింక కొంచం హుషారుగ పాడుతుంది పాట! ముసలయ్య ముగ్ధుడై నిలబడిపోతాడు!— 'ఏం ముసలయ్యబావా? నిటారు కొమ్మలా నిలబడిపోయావే నడివీథిలో!' అని పొలం దగ్గరనుండి తిరిగివస్తున్న పాలేరు పలకరింపుతోనో, లేదు, చంకన బుట్టబెట్టి సంజకబళంకోసం కడప కడప తిరుగుతున్న చాకలిచెంగయ్య 'లచ్చుమమ్మగారెమో అయిదేండ్లు నెత్తికెక్కిన బుల్లోణ్ణి అడ్డబాలబిడ్డగా ముదిగారం చేస్తుంటే ముసలయ్య అంతకన్నా అడ్డబాల బిడ్డయినాడే నడివీథిలో!' అన్న పరిహాసపు చిలకరింపుతోనో, ముసలయ్య ఈ లోకంలో పడతాడు. శారీరకంగా తానీ లోకంలో అడుగుపెట్టినా మనసుమాత్రం తనకు జ్ఞాపకమున్న అయిదేండ్ల ప్రాయానికే పరుగులుతీస్తూ ఉంటుంది.

అవును! అప్పుడు తాను అయిదేండ్ల బాలుడు. తన ఈడు వాళ్ళందరూ 'అమ్మా!' అని ఆప్యాయంగా పిలుస్తూంటే, ఎవరిని అలా పిలవాలో తెలియని దీనుడు! తనకంటూ అమ్మ లేకపోయినా, ఈ దేశంలో యింటికొక్క అమ్మ ఉంటుంది. వారందరినీ 'అమ్మా!' అని పిలువవచ్చులే అని ఆ చిన్నవయస్సులోనే సమాధానపరచుకొని, ఆ పిలుపు తనకు ఎంతవరకు శరణ్యమవుతుందో తెలుసుకొనడానికి బయలుదేరిన ధీరుడు!

ఆ ప్రయాణంలో ఎన్నో అనుభూతులు, తిట్లు, దీవెనలు, చీదరింపులు, ఆదరింపులు అన్నీ కలగాపులగంగా కలిసి, సుడిగాలిలా విజృంభించి

తన్ను మెడపట్టి కాలప్రవాహంలోనికి నెట్టితే, అందులోపడి మునుగుతూ తేలుతూ ఆ ప్రవాహ వేగానికి వాటముగాపడి కొట్టుకపోతూ పోతూ, ఏదో కాస్త ఆధారం దొరకినట్లనిపించి, కాలు నిలదొక్కుకొని నిలబడిచూస్తే — అదొకపల్లె!

ఆ పల్లె. సహజ సౌందర్యానికి ముల్లె. చుట్టూ శిథిలమైన కోటగోడల్లా బోడిగుట్టలు. ఊరిని ఆనుకొని దక్షిణంగా తేనీటిగుంట. ఆ గుంట కట్టపై యేపుగ పెరిగి, బాటసారులకు అయాచితముగ ఆశ్రయమిస్తున్న వృక్షసముదాయము...... వీటిక్రిందపఱచిన రాతిబండలు......ఆ కొలను క్రింద బావులు ఎన్నడూ నమ్ముకొన్న రైతులను నట్టేట్లో ముంచలేదు. కాగ రైతుల చెమటతో వన్నెలు చిన్నెలు వారుకొన్న పచ్చని పొలాలు...చుట్టూ పరిభ్రమిస్తూ భట్రాజు పనులు నిర్వహిస్తున్న ఉపగ్రహాలమధ్య కాస్తోకూస్తో పేరు సంపాదించుకొన్న నేటి రచయితవలె, కూతదవ్వులో ఓ అయిదారుపల్లెలు తన్నాశ్రయించిఉంటే చూడ ముచ్చటగా ఉంటుందాపల్లె!

కుందేళ్ల కుక్కలను తరుమడంతో విజయనగరసామ్రాజ్యానికి ముఖ్యపట్టణం వెలిసిందట ఒకనాడు! కడుపు సుష్టుగా నిండడంతో ముసలయ్యకు స్థావరం దొరికిందీనాడు. వంకలు, వాగుల మీద వంతెనలుకట్టి, వంకరటింకరలను నేరుగా తీర్చిదిద్ది, కార్లు కదలకుండా ప్రయాణం చేయవలెనని కాంక్షించి లక్షలకు లక్షలు వెచ్చించే ప్రభుత్వం — బీదవాడి కడుపులోని పల్లాన్నిమాత్రం పూడ్చలేకపోతూఉంది. అయితే ఆ పల్లెలోమాత్రం ఒకతరం మనుష్యులు యింకనూ బ్రదికేఉన్నారు. వారికి నాగరకత, సంస్కృతిఅన్నపదాలకు అర్థం తెలియదు. ప్రగతిఅన్నమాట వారి చెవిని పడివుండదు. అయితే 'ఆకలి'అంటే, 'అయ్యో!' అనగల ఔదార్యం మాత్రం వారి కుంటుంది. పంచభక్ష్యపరమాన్నాలు 'టేబిలు'మీద వడ్డించలేకపోయినా, కుండ అడుగైనా గీకి, నాలుగుదోసిళ్లకూటినీళ్లలో కలిపి, రవంతసానుభూతి ఊరుగాయగా చేతికందించి, త్రాగమనగలరు ఆప్యాయంగా! అందుకే ముసలయ్య అక్కడనుండి అడుగు కదపలేకపోయాడు.

పగటిపూట యే యింటిముందరనో నిలబడి 'అమ్మా!' అంటే అరముద్దసంకటికి, ఓ అబకచారుకు లోటుజరిగేదికాదు. దాంతో ముసలయ్య నేరుగా గుంటకట్టపై చేరేవాడు. అరముద్ద సంకటి...గుంటలో రెండు దోసిళ్ల తేనీరు...కడుపు నిండేది. కడుపునిండితే కైలాసమన్నారు అనుభవించినవారు. రాతిబండలపై మేనువాల్చి, చల్లని చెట్లనీడలో నిజంగా ముసలయ్య కైలాసములో ఉన్నట్లుగానే భావించాడు. ఆ భావనతోనే రోజులు దొర్లిపోతున్నాయి. అయితే రోజు లన్నవి ఒకేవిధంగా జరిగిపోతే ఈ లోకంలో యిన్ని అవాంతరాలకు ఆస్పదముండేదికాదు. జీవితం ఓ చిన్నసంఘటనతో పతనానికి దారితీయవచ్చు — లేదా, ప్రగతివైపు మరల వచ్చు. అదే జరిగిందారోజు!

ఆ రోజు — ఎవరో దేశనాయకుడు పుట్టిన రోజట! ఆ పల్లెలోని వీధిబడి మూసివేయవలసింది. అయితే, 'ఇదేం చోద్యమమ్మా! ఆఁ! అంటె ఆటవిడుపు. ఊఁ! అంటే బడి మూత!! ఇవేం బడులా? పాడుబడిన గుడులా!' అని వాపోయే ఆ పల్లెవాసులకు భయపడి పాపం! ఆ ఉపాధ్యాయుడు మధ్యాహ్నంవరకు పనిచేసి, దేశనాయకుల గురించి నూరిపోసి, ఆ మీదట సెలవు యిచ్చాడు. ఆ సంతోషాన్ని పట్టలేని పిల్లలు 'కాంగ్రెసుకూ జై! కాడెద్దులకూ జై!!' అని నినాదాలుచేస్తూ పరుగులు తీస్తున్నారు. 'కాంగ్రెసూ లేదు. కాడెద్దులూ లేవు. వలపెద్దుగతి వలపెద్దుదే! దాపటిగిత్తదారి దాపటి గిత్తదే! ఆ రోజు రాకపోదు అప్పుడేవౌనో చూద్దాంలే ఈ వినావాలు!' — అని ఈ పిచ్చిలోకాన్నిచూచి 'ఫక్కు'మని నవ్వినట్లుంది సూర్యభగవానుడు. ఆయన పాలిటికది నవ్వుగా తోచినా ఆ వెలుగు తాకిడికి

లోకం ఉసూరుమంటూ కాసంత నీడకై తాపత్రయపడుతూ ఉంది. ముసలయ్యమాత్రం కాళ్ళు చేతులు బారసాచి రాతిబండమీద స్వర్గసౌఖ్యాన్ని అనుభవిస్తున్నాడు కూనిరాగాలు తీస్తూ. ఇంటిలో కాసంత వుక్కపోస్తున్నట్లనిపించిందేమో, కాసేపు గుంటకట్టమీద చల్లని గాలిని సేవిద్దామని పెద్దరామిరెడ్డి కట్టమీదికి వచ్చాడు. పెద్దరామిరెడ్డి అంటే—పాయకట్టులో పిట్ట నీళ్ళు త్రాగదు. దృష్టికుండంత తలగుడ్డ, తీర్చిదిద్దినట్లు మూడు పట్టెనామాలు, చెవుల్లో ఎఱ్ఱటి అంటు పోగులు ... మెలికలు తిరిగిన మీసాలు...చేయెత్తు విగ్రహానికి మరింత శోభను చేకూరుస్తుంటాయి. కనుచూపుమేరంలో కంటపడ్డ మనిషికై మోడ్చి పక్కకు తప్పుకోవలసిందేకాని ఎదుటపడనీయని వ్యక్తిత్వం ఆయనది. ముండ్లమధ్య గులాబులు పూస్తాయి. అంతగంభీరమైన వ్యక్తిత్వం వెనుక వెన్నపూసలాంటి హృదయముంది.

సాధారణంగా పెద్దరామిరెడ్డి కట్టమీదికివస్తే రాతిబండలన్నీ ప్రీతిగా స్వాగతం పలుకుతాయి. కానీ ఆరోజు స్వాగతవచనానికి పానకంలో పుడకలాగ అనామకుడు ముసలయ్య అడ్డు తగిలాడు!

'ఎవరురా నువ్వు?'

ముసలయ్య వినిపించుకొనేస్థితిలోలేదు. స్వర్గసౌఖ్యం అలాంటిది మరి!

'చెవుల్లో చెట్లు మొలిచాయారా?'

గద్దించాడు పెద్దరామిరెడ్డి.

ఆ గద్దింపుతో ఈ లోకంలో పడ్డాడు ముసలయ్య. ఆ మూర్తిని చూస్తుంటే ఏదో తెలియని భయం ఆవరించింది. ఎగిరి క్రిందదూకి 'తప్పుబాబూ!' అన్నట్లుగ పాదాలమీద పడ్డాడు. 'లే! లేరా!!' అంటూ పెద రామిరెడ్డి బండమీద ఆసీనుడయ్యాడు. తప్పుచేసిన ముద్దాయిలాగ అల్లంత దవ్వులో నిలబడ్డాడు ముసలయ్య

'ఏవూరు బుల్లోడా మీది?'

గోముగా అడిగాడు పెద్దరామిరెడ్డి.

'అడుక్కుతినేవాడికి ఒక ఊరేముంది బాబూ!'

దేశాటనంలో గడించిన అనుభవంతో అనుగుణంగానే సమాధానమిచ్చాడు.

'ఛ! అదేం బతుకురా? కాలూ చెయ్యిలేనివాడు అడుక్కుతినడానికి అర్హుడు. నీలాంటివాడు పనిచేసి బతకాలిరా!'

సగర్వంగా వెలువడ్డాయి మాటలు.

'నా మొగానికి పని ఎవురిస్తారు బాబూ?'

సందేహాన్ని వెలిబుచ్చాడు ముసలయ్య.

'ఇస్తే చేస్తావురా?'

'ఓ'

అని భుజాలు ఎగురువేశాడు ముసలయ్య

అంతే! ఆ రోజునుండి దారి కొక్కటిగ పోతూవుండిన ఎనుపగొడ్లు ఒక్కదారిన పడ్డాయి. వాటి నాయకుడు ముసలయ్య.

ఇప్పుడు ముసలయ్య బ్రదుకు ఒకదారిన పడ్డది. గుంటకట్టమీది మకాం ఊరిలోని రామాలయానికి మార్చబడింది భజనమందిరంలో బయటి అరుగుమీద రాత్రి నిద్రపోతాడు. ఉదయం నిద్రలేచి గుంటలో మొగము కడుక్కొంటాడు వంతు ప్రకారం ఏ యింట్లోనో ఒక యింట్లో చల్దికడుపునిండుకు త్రాగుతాడు. ఆ మీదట యింటింట ఎనుముల పలుపులు విడిపిస్తాడు. వాటిని మేపడానికి తోలుకపోయి మరల ఏ సాయంకాలానికో యిళ్ళు చేరుతాడు. ఎవరి గొడ్లను వారివారి కొట్టములో కట్టబెడతాడు. అప్పటికి ప్రొద్దుక్రుంకుతుంది. ఆపైన ముసలయ్య భజనమందిరంచేరుకొనేలోపల ఎవరు ఏ పనైనా చెప్పవచ్చు. 'ఒంట్లో కాస్త నలతగా ఉండి కసువుకు పోలేకపోతిని! ఒకమోపు కసువు కోసుకరారా ముసిలిగా!' అని ఉత్తరువు జారీచేయవచ్చు. లేదు—'రేపు వరినాటు. పదిమందికిపైగా కూలోళ్ళు. ఇంట్లోచూస్తే చిటికెడురాగిపిండి

లేదు ఒకవెయ్యివట్టు నాయనా ముసలయ్యా!' అని ఓ మగువ మర్యాదగా పిలువవచ్చు. 'హుకుం'లోని హుందాతనానికి, మర్యాదలోని మార్దవానికి తేడా తెలియని ముసలయ్య ఎవరినీ కాదనలేదు. కాగా నెలలు తిరుగకముందే అందరికీ తలలోని నాల్కగా తయారయ్యాడు.

'కలిసివచ్చే కాపురానికి యేకాలుపెట్టినా ఒక్కటే'అన్న పెద్దలే మరలా కుడికాలే పెట్టమంటారు పట్టింపుగా. బహుశా ఆ పల్లెలో అడుగుపెట్టినపుడు మొదట కుడికాలూనినట్లుంది ముసలయ్య. సుడిగాలివాతబడ్డ పుల్లాకు లాంటి అతని జీవితం ఓ మలుపు తిరుగడానికి నిశ్చలమైన వాతావరణం ఆ పల్లెలో లభించింది. రాత్రి పనీ పాట ముగించుకొని భజనమందిరం అరుగుపై చేరేసరికి ముసలయ్యకు ఏ జామురాత్రో దాటిఉంటుంది, అంతకుమునుపే అక్కడ వెంకట్రాయులుతాత హాజరయి ఉంటాడు.

'వెంకట్రాయులు' అంటే ఏ వెంకట్రాయులు అనగలిగే ఆ పల్లెలో 'పరమాత్ముడు' అంటే పసిపిల్లవాడుకూడా ఫలానా అని చెప్పగలడు. ఎంతగానో ప్రేమించి, మరెంతగానో ఆనందమయ జీవితాన్ని ఆశించి వెంకట్రాయులు జీవిత భాగస్వామిని తెచ్చుకొన్నాడు, తన యిరవైఅయిదవ యేట! పువ్వు పూసినట్లున్న పండువెన్నెల్లో, పిచ్చిగా పూచిన మల్లెపందిరిక్రింద, పట్టెమంచముమీదపవళింపజేసి గోరువెచ్చని పాలు, పచ్చకప్పురపువిడెము అందివ్వలేకపోయినా, అనురాగసుధామృతభాండము భాండముగా సమర్పించి పొలములో పోటీపడి పనిచేసేది ఆమె. 'సమష్టి కృషితో తాము మనుష్యులుగా నిలబడవచ్చులే!' అని కలలు కనేవాడు వెంకట్రాయులు. అయితే అతనికలలు కలలుగానే నిలిపి చేయిజారవిడిచి పోయింది ఆమె! ఆ రోజునుండి జీవచ్ఛవములాగ బ్రదుకుతున్నాడు వెంకట్రాయులు. ఎవరో అయిన వాళ్ళ పెట్టుపోతలకు సంతృప్తిపడుతూ, ప్రొద్దస్తమానము పొలములో పనిచేయడము, 'మళ్ళీ పెళ్ళి చేసుకోరాదా? వెంకట్రాయులూ!' అంటే— 'ఒకసారి చేసుకొని ఏమి వారుకొన్నానులే!' అని సమాధానమివ్వడము, రాత్రి రామాలయములో అరుగు శరణ్యముకాగా కాలజ్ఞానతత్త్వాలు పాడుకొనడము అతని దినచర్య. తానేమో, పనేమోగా జీవిస్తూ సదా రామనామాన్ని జపిస్తూ వెంకట్రాయులు పరమాత్ముడైనాడు ఆ పల్లెవాసుల పాలిటికి. ఆ పల్లెలో వేకువజామున నిద్రలేస్తే కోడికూతకాదు మొదట చెవిని పడేది, పరమాత్ముని కాలజ్ఞాన తత్త్వం. ఈ తత్త్వంలోనే అరవైయో పడిలో పడ్డాడు వెంకట్రాయులు తాత!—కాదు పరమాత్ముడనబడే ఆ కర్మయోగి!

ఇప్పుడు తాతకు తోడు ముసలయ్య. ముసలయ్యకు తోడు తాత. మొదట తాతయ్య తోడు భరించడం ముసలయ్యకు కష్టంగానే తోచింది. ఎందుకంటే, 'ఎండ' అనక 'గాలి' అనక నోరులేని ఆ గొడ్లతోకపట్టుక తిరిగి తిరిగి, అలసి సొలసి, ఇంట్లో అడుగుపెట్టేసరికి ఏదో ఒక పని తనకోసం ఎదురుచూస్తూ ఉంటుంది. అది పూర్తి చేసేసరికి ఒంట్లోవున్నకాస్త ఓపిక నశిస్తుంది. 'ఎప్పుడు భజనగుడి అరుగు చేరుదామా!' అని మనసు ఉరకలువేస్తూ ఉంటుంది. అరుగుమీద అలా ఒరిగిపోతే అన్నీ మరచిపోతుంది తనువు. అయితే ఒకవేళకాడే ఆరంభమవుతుంది తాతగారి తత్త్వం. అప్పటినుండి కన్నులు పొడుచుకొంటేకూడ నిద్ర రాదు. మిద్దింటి లక్ష్మమ్మ యిచ్చిన చాలీచాలని పాతదుప్పటిని ఒళ్ళంతా కప్పుకోవడానికి తంటాలు పడుతూ, 'ఏమిటీ రంపు'అని విసుక్కొంటున్నాడే కాని, మనసువిప్పి అడుగలేక పోతున్నాడు. ఒకటి రెండుసార్లు ప్రయత్నించినా, ధైర్యంచాలక ఆ ప్రయత్నాన్ని మానుకొన్నాడు.

'ఏం అట్ల నసుగుతుండావ్? నిద్రపట్టలేదా ముసలయ్యా!'

ఒకరోజు వేకుపజామున వెంకట్రాయులుతాత అడిగాడు ముసలయ్యను.

'చెవుల్లో యిల్లు కట్టుకొన్నట్టు ఒకటే రంపుగాఉంటే, నిద్ర ఎట్లవస్తుంది తాతా!'

మెల్లగా గొణిగాడు ముసలయ్య.

'పున్నెంకొద్దీ పురుషుడు, భక్తికొద్దీ ఫలితం నాయనా! రామనామంరుచి తెలుసుకోవాలంటే పూర్వజన్మసుకృతంకూడ ఉండాలి. అది లేని వాడికి రంపుగానే తోస్తుంది.'

'అయితే యిప్పుడేదో అంటివే? అది నీకుంది! నాకు లేదా తాతా?'

పూర్వజన్మమేదో పరజన్మమేదో తెలియని ముసలయ్య అమాయకంగా ప్రశ్నించాడు. అంత కంటే అమాయకంగా 'గలగల' నవ్వేశాడు తాత!

'ఎందుకు తాతా నవ్వుతుండావు?'

'లేదు ముసలయ్యా! నువ్వడిగినమాట తలచుకొంటే ఒక కత మతికొస్తా ఉంది'

'కతనా! అయితే చెప్పు తాతా! నిద్రేమో రాలేదు. అదన్నా వింటాను.'

'అనగనగ ఒకరాజు. ఆ రాజుకు దేవునికి నూరామడల దూరం. వాళ్లిద్దరిమధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గున మండేది. కాని అతనికి పుట్టినబిడ్డ మాత్రం దేవుడంటే పడిచచ్చేవాడు. కాగా అబ్బ కొడుకులకు పొత్తు కుదరలేదు. ఆ దేవునిమాట తలపెట్టవద్దని రాజు నెత్తిన నోరుపెట్టుకొని మొత్తుకొన్నాడు. కొడుకు పెడచెవిని పెట్టినాడు. దాంతో రాజు 'కుతకుత' ఉడికిపోయాడు. బిడ్డను పాములచేత కరపించినాడు. సలసలకాగే నూనెలో తోయించినాడు!'

'నువ్వు చెప్పేది బలేఉంది తాతా! పాముల చేత కరిపిస్తే మళ్లీ బతికితేగదా నూనెలో తోయించడానికి?'

'అదే నాయనా! ఆ దేవుడిమహిమ. అక్కసు కొద్దీ రాజు ఏమిచేయించినా బిడ్డ చెక్కుచెదరలేదు. తన దారి తప్పలేదు. కడకు 'దేవుడు! దేవుడు!!' అంటున్నావే? ఎక్కడుండాడురా నీ దేవుడు?' అని నిలదీసి అడిగినాడు రాజు. 'ఎక్కడ పడితే అక్కడున్నాడు దేవుడు' అని ఆ బిడ్డ సమాధాన మిచ్చినాడు. దాంతో ఆ రాక్షసరాజు రెచ్చిపోయి, 'ఈ స్తంభములో ఉన్నాడా నీ దేవుడు?' అని అడిగితే 'ఓ' అన్నాడు. అంతే! రాజు ఎగిరితన్నినాడు ఆ స్తంభాన్ని! ఆ బిడ్డమాట పొల్లుపోలేదు నాయనా! దేవుడక్కడ వెలిసినాడు!'

'నిజంగానా తాతా!' ఆశ్చర్యాన్ని వెలిబుచ్చాడు ముసలయ్య.

'ముమ్మాటికీ నిజం నాయనా! నమ్మిన వాళ్లను నట్టేట్లో ముంచడం అతని పద్ధతి గాదు!'

'అయితే నాకుకూడ కనుపిస్తాడా తాతా ఆ దేవుడు?'

'నీకేగాదు. ఎవరికైనా కనుపిస్తాడు. అయితే అది మనం నడచుకొనే తీరునుబట్టి ఉంటుంది.'

'అయితే మనమెట్లా నడచుకొనాలి తాతా?'

'నాయనా ముసలయ్యా! నీ నడతవల్ల ఎదుటివాడి మనస్సు నలత పడగూడదు. నీ పనేమో నువ్వేమో, ఆ పైన ఆయన నామస్మరణమేమోగా ఉండు. ఏ నాటికైనా ఆయన దయకలుగుతుంది.'

'ఆఁ!...............'

'అవును నాయనా! ఇప్పుడు మనం అనుభవిస్తున్న మంచిగానీ చెడుగానీ, ఈ ఒక్క జన్మలోనిదికాదు. అది జన్మజన్మాలకు సంబంధించినది. కనీసం యిప్పుడైనా యీ సంగతి తెలుసుకొని మసలుకొంటే మరుజన్మకైన విముక్తి దొరుకుతుంది. ఈ తాపత్రయాల్లో చిక్కుకొని తేనెలో

వడ్డ ఈగల్లాగ తికమకపడుతున్నామేకానీ తిరిగి చూడలేకపోతున్నాము.! పరమాత్ముని జీవితానుభవ సారము తేనెసోనలై ప్రవహిస్తుంది!

'చీకట్లో తారట్లాడినట్లుంది తాతా నీ మాటలు!'

అమాయకంగా అంటాడు ముసలయ్య.

'ఇంకా చీకటేమిటి నాయనా! అటుచూడు. తూర్పున పటమెగిరింది. లే! పోదాం. పాడుపొట్ట కోసం పాటు తప్పదుగదా మరి!' అంటాడు తాత.

ఎవరి దారి వారిది అవుతుంది.

మరనాగళ్లు పెట్టి దున్ని, ఎన్నో రసాయనిక ఎరువులు వాడినన్నూ, చవిటి వేలలో పండనిపంట ఒండ్రుమట్టి నేలలో రెండు బళ్లు అటు, రెండు బళ్లు యిటు దున్ని విత్తనమువేస్తే బ్రహ్మాండమైన పంట కనులపండువు గొలుపుతుంది!

ఇప్పుడు ముసలయ్య, తాతతత్త్వాలంటె విసుగుపడడడం లేదు. పైగా తాతకు ముందే నిద్ర లేస్తున్నాడు. మంచినీళ్లగుంటలో మునుగుతున్నాడు. తాత తత్త్వాలు పాడుతుంటే, విశ్చలంగా దేవునిముందు కూర్చుని 'నన్ను మంచి దారిన నడిపించు సామీ!' అని మొరపెట్టుకొంటున్నాడు.

'ఒరే! ఊ యిచ్చిత్రం యిన్నావంట్రా?'

'ఏవిట్రా అది? చంద్రలోకానికి నిచ్చెనలు వేసేదానికి రష్యావాడు అమెరికావాడు పోటీపడడమా?'

'రష్యావాడు రగిలిపోనీ, అమెరికావాడు ఆరిపోనీ! మన కెందుకు? — మన పరమాత్ముడి సంగతిరా?'

'వాడికేమయిందిరా? ఇంతకుముందే చూస్తిని. 'చెప్పలేదం టనకపొయ్యేరు'అని రాగాలుతీస్తూ పెద బావిలో కపిల తోలుతూ ఉండె!'

వాడికేమీ కాలేదుకానీ, ఈపొద్దో రేపో 'టిక్కట్టు' తీసుకొనేటట్లుందని సందేహం కలిగినట్లుందిరా! తన పరమాత్ముని 'పట్నం'గురించి ఒకే తపన పడుతూండె. ఆ దిగులు తీరిపోయినట్లుందిరా!'


Statement about ownership and other particulars about newspaper

**BHARATI**

*FORM IV* (SEE RULE 8)

1. Place ot publication: Madras
2. Periodicity of its publication: Monthly
3. Printer's Name: Sri S. Radhakrishna

   Whether citizen of Indhia Yes
   If foreigner, state the country of origin —

   Address: 6 & 7, Thambu Chetty Street, Madras-1
4. Publishers Name: Sri S. Radhakrishna

   Whether citizen of India Yes
   If foreigner, state the country of origin —

Address : (As above)

5. Editors Name : Sri S. Sambhu Prasad

   Whether citizen of Indhia Yes
   If foreigner, state the country of origin —
   Address : 16, Luz Avenue, Mylapore, Madras-4.
6. Names and addresses of individuals who own the newspaper and partners or share-holders holding more than one percent of the total capital.

| NAMES | ADDRESSES |
|---|---|
| 1. Mr. S. Sambhu Prasad | 16, Luz Avenue, Mylapore, Madras-4. |
| 2. Mrs. S. Kamakshamma | Do |
| 3. Mr. S. Nageswara Rao | Do |
| 4. Mr. S. Radhakrishna | 6 & 7, Thambu Chetty Street, Madras-1. |

I, S. Radhakrishna, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

S. RADHAKRISHNA

1-3-70 Signature of Publisher

'కొంపదీసి నువ్వేమైన ఒప్పుకొన్నావురా ఆ పట్టం కట్టుకొనడానికి!'

'ఓస్ నాసురకమా? మన కెక్కడిదిరా ఆ భాగ్గ్యం...దానికంతా పెట్టిపుట్టాలిరా నాయనా! వాడుండ్లా మన ముసిలిగాడు...'

'అయితే తాత పెదపరమాత్మడైతే, ముసిలిగాడు చినపరమాత్మడైనాడన్నమాట మన పాలిటికి!'

ఆ మాటలో ఆ పల్లెలోని కుర్రవారు గొల్లుమంటుంది.

ఈ మాటలు అక్కడకూడ వినిపించడానికి ఆ పల్లెలో ఎక్కువకాలం పట్టలేదు!

'పరమాత్మ' డనబడే వెంకట్రాయులుతాత ఈ పూట లేక రేపు 'టిక్కట్టు' తీసుకోవచ్చు. ముసలయ్య పరమాత్మని పట్టం చేపట్టవచ్చు. ఏది ఏమైనా కావచ్చు! నా పనిమాత్రం నాది!' అని కాలపురుషుడు కాలు ఆడించడములో రోజాలు శరవేగంతో దొర్లిపోతున్నవి. స్వాతంత్ర్య సమర ఫలితంగ దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. మనిషి మనిషిగా బ్రదుకడానికి మార్గ్గం కనుపించినదని మానవాళిసంతోషంతో తేలిపోతూ ఉంది. ప్రజలే ప్రభుత్వము, ప్రభుత్వమే ప్రజలై ప్రగతివైపు పరుగెత్తాలని ప్రణాళికలు తయారుచేస్తున్నారు కాగితములమీద! ఫలితంగా పంచాయతీరాజ్యాలు అవతరించినవి.

ఈలోపుగ వెంకట్రాయులుతాత అనుకొన్నట్టుగానే టిక్కట్టు తీసుకొన్నాడు. అయితే పోతూపోతూ 'పరమాత్మని' పట్టం ముసలయ్యపరం చేయడంతోపాటు తనకున్న పదికుంటల పొలాన్ని పట్టా చేసి యిచ్చిపోయాడు. నిలువడానికి కాస్త నీడను ఏర్పరచిన పెద్దరామిరెడ్డికూడ ఈమధ్య మంచమే శరణ్యంగా ఉన్నాడు. బాగా పండినపండు. ఎప్పుడు తొడిమ వీడుతుందో తెలియదు. ముసలయ్యమాత్రం అప్పుడప్పుడు వెళ్ళి పెదరామిరెడ్డియెదుట పడి వస్తున్నాడు.

ఒక రోజు—

కూర్చోమని సైగచేశాడు పెదరామిరెడ్డి. ఇంకనూ ఒదిగి నిలబడ్డాడు ముసలయ్య. పెదరామిరెడ్డి వదనారవిందమున దరహాస చంద్రికలు మీసాలమాటునుండి తొంగి తొంగి చూస్తున్నాయి.

'ఒరే ముసలయ్యా! బుడంకాయంత బుర్లోడివి. నిన్నట్లనే వదలివుంటే ఏ యెద్దుకాలికిందైనా పడి చిట్లిపోయి వుందువు. చూస్తుండగనే, నేనే అసూయపడేంత మగాడివైతివి. ఈ నాడు నిన్ను చూస్తుంటే చాల సంతోషంగా ఉందిరా!'

ఒరిగి నిలబడ్డ ముసలయ్య మెలికలు తిరిగిపోతున్నాడా మాటలతో!

'ఒళ్లు పెరిగింది. కళ్లుకూడ నెత్తికెక్కలేదంట. పదికుంటల కొండ్రచేతి కొచ్చింది. ఇక పోతే ఒక యింటివాడవైతే బాగుండి పోవురా!'

తనలో తాను గొణుక్కున్నట్టు అన్నాడు రామిరెడ్డి.

ఆనందలహరిలో తేలిపోతున్నాడు ముసలయ్య.

'అది సరేకానీ ముసలయ్యా! రాత్రనక పగలనక ఆ గుళ్లోపడి 'దేవుడో! దేవుడో! అని కొట్టుకుంటున్నావటనే! ఆ దేవుడు కనుపించాడా నీకు?'

ఉన్నట్లుండి ఏదో మరచిపోయిన సంగతి మతికి దెచ్చుకొన్నట్లు అడిగిన మాటకు, వినీ విననట్లు సంబరపడి, ఆపై తల అడ్డంగా త్రిప్పాడు ముసలయ్య అమాయకంగా.

'పెళ్లాం చచ్చింది మొదలు వాడా వెంకట్రాయులుకూడ అదే గుళ్లో కళ్లకు వత్తులు వేసుకొని ఆ దేవుడికోసం తంటాలుపడ్డాడే! పోనీ! వాడికి - ఆ వెంకట్రాయులు గాడికైనా కనుపించాడా ఆ దేవుడు? కనీసం ఒక్కమాటైనా మాట్లాడి

నాడా?' —ఆవేశం, అనుభవం, ఆగ్రహం అన్నీ మిళితమై మాటల రూపాన్ని సంతరించుకొంటే, అడుగు కదపలేకుండా నిలబడి మాటలకోసం తడ బడుతున్నాడు ముసలయ్య.

'ఓరీ! పిచ్చిసన్నాసీ! గుళ్లోకాదురా దేవు డుండేది. ఎదుటివాని గుండెల్లోరా! కాటికి కాళ్లు చాచుకొన్నవాణ్ణి. ఎప్పుడో, ఏవేళనో నా ప్రయాణం. కానీ నువ్వుమాత్రం ఈ మాటలు మరచిపోవద్దు. పో! ఎదుటివానిగుండెల్లో ఉండే దేవునికోసం వెదుకు. ఆ దేవుణ్ణి చూడగలిగిననాడే నీ జన్మ సార్థకమవుతుంది. పోరా! పో!!' —

అంతటితో అలసిపోయినట్లుగ, తన బాధ్యత తీరినట్లుగ పెదరామిరెడ్డి ఆగిపోయాడు. ముసలయ్య అడుగులు మెల్లగ ముందుకు పడ్డాయి.

'వారితెన్నూలేని తన బ్రదుకునకు ఓ దారి చూపించాడు పెదరామిరెడ్డి, ఆ పల్లెలో యిరవై యేళ్లక్రిందట. ఆనాటినుండి ఆ దారినపడి నడు స్తూంటే సహజంగా నడకవలన కలిగే అలసట కలుగకపోగా, అనుకోని ఆనందమే లభించింది. ఎనుప గొడ్లుచుట్టూ తిరుగడములో తన బ్రదుకు ఆరంభ మైనా ఆ చుట్టుప్రక్క పల్లెలన్నీ తనచుట్టు తిరుగుతున్నాయి. ఏఏట భారతోత్సవాలు తన చేతులమీదుగ జరుగుతున్నాయి. కోట కోటమ్మ తిరణాలు తాను లేకపోతే అసలు జరుగదు. అది మంచిగానీ చెడుగానీ—ఏయింట యేమిజరిగినా తాను నట్టింట కూర్చోవలసిందే! కడకు మొన్న జరిగిన పంచాయతీఎన్నికల్లో, కామసానిచిన్నసామి ఏక గ్రీవంగా ఎన్నుకోబడి, తనచేతకు అడ్డులేకుండా అడ్డదిడ్డంగా నడుస్తుంటే, దివములమీద అతనిని దింపించి, శిరిపిరెడ్డిపెద్దిరెడ్డిని అధ్యక్షుణ్ణి చేసిం దానికి కారకుడుకూడ తానే అంటారు వారు వీరు. ఆ గ్రామమున జనసంఘానికి అధ్యక్షుడొకడు, కార్యదర్శి మరొకడైతేకూడ తన మాటకు తిరుగు లేదు. ఆ సంఘములోనేకాదు—చుట్టుప్రక్క పల్లెల్లో గిచినగీతకు దాటులేదు. తొలినాటిగతి, ఈనాటి స్థితి తలచుకొంటే తన ఆశ్చర్యానికి అవధు లుండవు.'

ఇదంతా రాముని కృపవల్లనే జరిగిందని, జరుగుతూ ఉందని, ఇన్నాళ్ళుగ భావిస్తున్నాడు ముసలయ్య. అందుకే వెంకట్రాయులుతాత మాట ప్రకారం రామాలయంలో రామనామం జపిస్తూ, తత్త్వాలు ఆలపిస్తున్నాడు ప్రతిదినము తప్ప కుండా. కానీ ఈ రోజు రామిరెడ్డి ఎదుటవాని గుండెల్లో దేవుణ్ణి చూడమన్నాడు. ఎదుటివాని గుండెల్లో దేవుడున్నాడా? అయితే దేవు డనబడే వాడొక్కడేకదా? ఉంటే—ఈ మనుష్యుల్లో యిన్ని అవకతవక లెందుకు?...

రాత్రి రెండుజాములై ఉంటుంది. రామా లయం అరుగుమీద అంతులేని ఆలోచనలతో సత మత మవుతున్నాడు ముసలయ్య. తేనీటిగుంటలో ఎండ్రకాయల మెక్కడానికివచ్చిన పొట్టినక్కలు ఉండుండి అరుస్తున్నాయి. ఊరిలో కుక్కలు వాటితో శ్రుతికలుపుతున్నాయి. పెదరాగిమానులో పైడిగంటలు యీ పోరు పడలేక—అవిగూడ అదే పనిచేస్తున్నాయి. ఎదుటిమనిషి గుండెల్లో దేవుడి కోసం తపించిపోతున్నాడు ముసలయ్య. ఎంతసేపటికి యిదమిత్థమని తేల్చుకోలేక మాగన్నుగ కన్ను మూశాడు.

'ముసలయ్యా!'

'ఎవరూ? వెంకట్రాయులుతాతా! ఎన్నాళ్ల కెన్నాళ్లకు? రా తాతా! రా! నన్నొంటిగ వదలి ఎక్కడికిపోతివి తాత యిన్నాళ్లు!'

'అదిసరేకానీ, ఎందుకట్ల నసుగుతుండావ్? నిద్దరాలేదా ముసలయ్యా?'

'ఏందో తాతా! నువ్వేమో అప్పుడెప్పుడో గుళ్లో దేవుని గురించి చెబితివి, ఇప్పుడేమో పెదరామిరెడ్డి ఎదుటి వాని గుండెల్లో దేవుణ్ణి

చూడమంటున్నాడు. నాకంతా అయోమయంగా ఉంది. నిద్ర ఎట్లవస్తుంది తాతా?'

'నాయనా ముసలయ్యా! గూడులేని గువ్వవు నువ్వు. నువ్వు బ్రతకడానికి ఒక దోవ చూపించాడు పెదరామిరెడ్డి. మంచిగా మసలుకోవడానికి ఒక మార్గం చూపించినాడు వెంకట్రాయులు తాత! అని అనుకొంటున్నావ్ కదూ?'

'అనుకోవడమేమిటి? జరిగిందికూడ అంతే గద తాతా?'

'వాళ్లుకాదు నాయనా ఆ పని చేసింది. వాళ్ల గుండెల్లో ఉండే దేవుడు. దేవుడంటే మంచికి మారుపేరే నాయనా!'

'నిజంగానా తాతా!'

'అవును నాయనా! మనం పొలములో కలుపు తీస్తున్నామంటే యేవిటి? మంచి బతకడానికి చెడును పెరికి వేస్తున్నాము. చేసేది మనమైనా చేయించేవాడు మాత్రం వాడేనాయనా!—ఆ దేవుడన బడేవాడు!!

'ఎంత బాగా చెప్పావు తాతా!'—అంటూ ఎగిరిపడి లేచాడు ముసలయ్య. కల చెదరిపోయింది. అప్పుడప్పుడే చీకటికూడ చెదరిపోతూ ఉంది.

'అయ్యో ఇదేవిటి? యిర్యరకదాకా నిద్ర పోయానే!' అని అనుకొంటూ ముసలయ్య రామాలయమునుండి కదిలాడు.

ఆ రోజునుండి ముసలయ్య నడవడిలో ఓ మార్పు కనుపించింది. అంతవరకు ఎవడైనా అన్యాయం చేశాడని తెలిస్తే, లేదు వింటే, 'వాడి కర్మ...వాడే అనుభవిస్తాడు!' అని పట్టించుకోకుండా తిరిగేవాడు, ఇప్పుడు బొట్టుపెట్టి పిలిచినట్లుగ అన్యాయాలకు అడ్డుపడుతున్నాడు. తప్పును తప్పుగ తేల్చి దోషికి తప్పు వేస్తేనేగాని తప్పదన్నట్లు పట్టుబడుతున్నాడు. ముసలయ్యలోని యీ మార్పు ఆనందదాయకమయింది ముఖ్యంగా యువజన సంఘానికి. ఈ మార్పులతో చేర్పులతో యేమాత్రం నిమిత్తంలేని కరుణారహితుడైన కాలపురుషుడు దినములను, నెలలను, సంవత్సరములను ఒక్కొక్కటిగ క్రమింగుతూ ఒకనాడు పెదరామిరెడ్డినికూడ గుటుక్కున మ్రింగివేశాడు.

సాధారణంగా ఆ గ్రామ యువజన సంఘ సమావేశము పంచాయతీ కార్యాలయ మనబడే గుంట కట్టవిూది గుడిసెలో నెలకొక్కసారి జరుగుతుంది. పనీపాట ముగించుకొని యువకులంతా రాత్రి ఆ గుడిసెలో గుమిగూడుతారు. దేశరాజకీయాలు మొదలుకొని ఆ రోజు గ్రామ పరిస్థితివరకు చర్చించుకొంటారు. చేయవలసిన పనులు నిర్ణయించుకొంటారు. ఆ నిర్ణయాలకు తిరుగుఉండదు మరి!

యథావిధంగా ఆ నెల సమావేశం జరిగింది. సభ్యులందరు హాజరయ్యారు. ముసలయ్యలోని మార్పుకు కారణం తెలుసుకోవలెనని అందరికీ కుతూహలంగానే ఉంది. కాగా, ఎవ్వరో ఒక్కరు అడగనే అడిగారు.

'ఈమధ్య పెద్దరామిరెడ్డి పైకిలేవడములేదు గదా! చూచివద్దామని పోతి నొకనాడు. మంచీచెడ్డ విచారించి, ఆయనేమో 'గుళ్లోకాదురా దేవుడుండేది. ఎదుటివాని గుండెల్లోరా!' అన్నాడు. వెంకట్రాయులుతాత గుళ్లోదేవునిగురించి యేనాడో చెప్పినాడు. ఎవరు దేవుడో? ఎక్కడ దేవుడో? అంతుపట్టకుండా మదనపడిపోతూంటే వెంకట్రాయులు తాతయ్యే చిక్కు విడదీసినాడు.'

అందరు చేష్టలుడిగివింటున్నారు ముసలయ్య మాటలు!

'ఆ రోజు రాత్రి ఎటూపాలుపోక గుళ్లో పడుకొన్నాను. పడుకొన్నానేగాని ఎంతసేపటికి నిద్ర రాలేదు. ఎదుటివానిగుండెల్లో దేవుడెట్ల ఉంటాడో అంతుదొరకలేదు. చాలరాత్రి అయి ఉంటుంది. కన్నట్ల మూసినానోలేదో వెంకట్రాయులుతాత కనుపించి, 'దేవుడంటే మంచికి మారుపేరే నాయనా!

మంచికోసం చెడును చెలిగిపారేయ్ కలుపుతీసినట్లు!' అన్నాడు.

'నిజమా!' అన్నారు అందరూ.

'ఆ దేవుడే దీనికి సాక్షి. అందుకే యికమీదట మంచికోసం ప్రాణం విడువడానికైనా వెనుకాడను.'

చాల నిబ్బరంగా పలికాడు ముసలయ్య.

'అయితే ఈ మాట నమ్మమంటావా?'

అడుగరానిమాట, అనుకోనివిధంగా అడుగవే అడిగాడు మూర్తికుమార్! —ఆ ఊరి మాజీ ప్రెసిడెంటు ముద్దులకొడుకు.

'నీకెందుకు కలిగిందిరా ఆ అనుమానం?'

నాలుగైదు గొంతుకలు కలిసి ప్రశ్నించాయి.

'ఆఁ! ఏమీలేదు. ఇన్నాళ్లుగ కర్మ సిద్ధాంతాన్ని పట్టుకొని ఊగులాడుతుండిన ముసలయ్య ఈనాడు ఒక్కసారిగ మారిపోయాడంటే నమ్మకం కుదరడంలేదు.'

చిరునవ్వులు చిందబోశాడు ముసలయ్య

'ఒరే మూర్తీ! నువ్వు చదువుకోసమనివెళ్లి అక్కడెక్కడో పడివుంటివి. ముసలయ్య సంగతి నీకంటె మాకు బాగా తెలుసు. తలచుకొంటే తిరుగులేదు.

సమర్థించింది యువజనసంఘం.

'అయితే యిప్పుడు మిమ్మందరినీ అడుగుతున్నా! ఎవడైనా ఒకడువచ్చి 'నాకు శక్తిలేదు. నన్నొకయింటివాణ్ణి చెయ్యండి!'అని అడిగితే అది మంచిపని అంటారా? చెడ్డపని అంటారా?'

మూర్తి ప్రశ్నించాడు.

'నూరు బొంకులుబొంకి ఒక కార్యం చేయమన్నారు పెద్దోళ్లు! నీకెందుకురా ఆ ధర్మసందేహం మూర్తీ!'

ఒక గొంతుక మారుప్రశ్న వేసింది.

'ఈ వివరించడాలు నా కనవసరము. నే నడిగిన దానికి ముక్కుసూటిగా సమాధానం చెప్పండి.'

త్రుంచినటుల అడిగాడు మూర్తి.

'అయితే సరి!...ఎవణ్ణయినాసరే. ఒకయింటివాణ్ణి చెయ్యడం మంచి పని!'

అందుకొన్నాడు ముసలయ్య.

'అయితే నన్నొక యింటివాణ్ణి చేయండి మీరందరూ కలిసి!'

విరగబడి నవ్వింది యువజన సంఘం!

అవును మరి! మాజీ ప్రెసిడెంటు కామసాని చిన్నసామి అంటే—బంగారుపండే పది ఎకరాల భూస్వామి. దీనికితోడు తినీతినక తాతముత్తాతలు సంపాదించిన నగలు నాణ్యాలు ఇనప్పెట్టె నిండుకు మూలుగుతున్నాయని వినికిడి. అంతేకాదు! కామసాని చిన్నసామి కార్యంపై కన్ను కలిగిన మనిషి. ఏదో బోడితలకు బొటనవ్రేలికి ముడివేసినట్లు బ్రదుకును లాక్కొనిపోయే ఆ పల్లెల్లోని రైతాంగము అయిదు పది కోసము అతనిని ఆశించడము కద్దు. అతను లేదనకుండ యివ్వడముకద్దు. ఎప్పుడు కూడ యిచ్చిన సొమ్మును అడిగిన పాపాన పోలేదు పుణ్యాత్ముడు. అయితే పంటలకాలంలో అసలు వడ్డీలతోసహా గుంజేస్తాడు పంటరూపంతో! రైతుల గుండెలు...చిన్నసామి యింటిలో యినప్పెట్టె బరువుగా మూలుగుతాయి! అంతటి సంపన్నుని ఏకైక పుత్రుడు మూర్తికుమారుడు కాలేజీ చదువులు ఒంటబట్టక, పట్నంలో నీళ్లు పడలేదన్న సాకుతో గ్రామసీమనుచేరి కడుపులో చల్లకదలకుండా కాలంగడుపుతున్నాడు. అతనిని ఒక యింటివాణ్ణి చేయడమంటే...

'ఎందుకట్ల నవ్వుతారురా? 'అంతమంచి మొగానికి అర్థసేరు పసుపా!' అన్నట్లు ఈ పల్లెటూరి దద్దమ్మలకు చక్కెర, గోధుమలు, బియ్యం, ఎందుకని, అవి పట్నాల వాళ్లకోసమే పండుతున్నాయని, మూటలకు మూటలు కొన్న చోటనే ంబా చేతినుండి ఆ చేతికి మార్చి జేబులు నింపుకొనే అవకాశమేమో అగ్గిలో కలిసింది. మిట్టన నాలుగుపారల మట్టినిదీసి పల్లానికివేసి

రోడ్లు వేయించామని కాంట్రాక్టర్ల హోదాలో కండ్లల్లో దుమ్ముకొట్టేవని కండ్లల్లోనే దుమ్ము కొట్టింది. మీ యబ్బసొత్తు పోయినట్లు మీరంతా పనికట్టుకొని వీడి అబ్బను 'మాజీ ప్రెసిడెంటు' అనిపించేవరకు నిద్రపోలేకపోతిరి. వీడేమో మీ తోక పట్టుక తిరుగుతుండె! ఇక అబ్బకొడుకులకు పొత్తు కుదురుతుందా? వాణ్ణి ఒక యింటివాణ్ణి చేయాలన్న తలంపు ఆ యబ్బకు కలుగుతుందా?'.

మూర్తి అభ్యర్థనకు మద్దతు కల్పించినందుకు ముకిసిపోయింది ఒక గొంతుక! 'ఓహో! అదాసంగతి!' అని తల వూపిన యువజనసంఘం 'కింకర్తవ్యం' అని మూర్తిని ప్రశ్నించింది.

'చాలరోజులనుండి ఈ విషయంగా నలుగుతున్నా! అసలు పెద్దవాళ్లు దీనిని అంగీకరించరు. పాపము...పుణ్యము...దేవుడుఅని పడిచచ్చే ముసలయ్య అంతకుముందు దీనిని ఒప్పుకోడు. అందుకే యిన్నాళ్లుగ నానవేస్తుంటిని. ఇప్పుడు ముసలయ్య మాటలతో కాస్త ధైర్యంవచ్చింది.'

నాందీ ప్రస్తావన చేశాడు మూర్తికుమారుడు. కుతూహలంతో ఎదురుచూస్తున్నది యువజనసంఘం. మూర్తి గుడిసె బయటికివచ్చి చూశాడు. జాము రాత్రి దాటిఉంటుంది. తేనీటి గుంటలో కప్పలబెకబెకలు......బాటమీదపోతున్న రెండెడ్లబండ్లదడదడలు మినహా మనిషి మసలినట్లు కనుపించలేదు.

గుండె దిటవుచేసుకొనివచ్చి కూర్చున్నాడు మూర్తి. గుడిసెలోని కిరసనాయిలుబుడ్డీదీపం నిశ్చలంగా వెలుగుతూ ఉంది. మసకవెలుతురులో అందరి మొగాల్లో ఆతురత ద్యోతకమవుతూంది.

'సంపతి పరదేసు కూతురు కామాక్షిని పెండ్లాడదామనుకొన్నా!'. ఎప్పుడో నిర్ణయించుకోగా ఆ నిర్ణయానికి యిక తిరుగులేనితీరు మూర్తి పలుకుల్లో ధ్వనిస్తూ ఉంది.

'ఆఁ! ఎవరిని? కామాక్షిని చేసుకొంటావా? ఆ ముండమోపిని!'

'ఏం? ముండమోపిమాత్రం మనిషికాదా? ఆమెకుమాత్రం హృదయంలేదా? పాపం! నెలలు తిరుగకముందే భర్తను పోగొట్టుకొన్న అదృష్టహీనురాలు. అలా మోడువారిపోవలసిందేనా? అలాంటి నిర్భాగ్యజీవికి విముక్తి కలిగించడం తప్పా?'

ఉపన్యాస ధోరణి నందుకొనింది మూర్తితీరు.

'ఏమైనా...?!' ఓమూల ఎవరిదో గొణుగుడు.

'ఏదో ఉద్ధరించాలన్నది మన సంఘ ఆశయము. ఉద్ధరించవలసింది అనాథలను, దీనులను, బీదలను! బాగా ఆలోచించండి! నా నిర్ణయంలోని మంచిని గ్రహించండి!' అంతటితో తన బాధ్యత తీరినట్లుగ లేచివెళ్లిపోయాడు మూర్తి.

అంతవరకు గంభీరముగా కూర్చుని అంతా వింటున్న ముసలయ్యకూడ బయలుదేరడంతో ఆనాటి సభ ముగిసింది!...

మామూలుగ రామాలయాన్ని చేరాడు ముసలయ్య. పడుకొన్నాడేకాని నిద్ర రావడంలేదు. 'జుం!' అని చీకటీగలమోత. అంతకుమించి ఆలోచనలు!

'నిజమే! కామాక్షి. అభము శుభము ఎరుగని ఆడబడుచు. పదహారేళ్లయినా నిండని చక్కని చుక్క. ఈడు జోడు చూచి కూలికొడవలి చేతికిచ్చారు తలిదండ్రులు. జోడుపోడుకాగా, కూలికొడవలిమాత్రమే మిగిలింది. అందుకే తండ్రి పంచన చేరింది. వయస్సు...అందము చెడ్డవి. ఈ స్థితిలో పదిమందీ ఆమె చుట్టూ తిరుగవచ్చు. ఏ వేళ ఎట్లుండునో తానూ కాలుజారవచ్చు. అప్పుడు ఆ పదిమందిలో ఎవరూ ఆమెను ఆదుకోవడానికి ముందుకురారు సరిగదా? ఆ పదిమందీ కంటికీ ఆమె పతిత! అంతకంటే ఒకని ఆధారంతో నీతిగా నిలబడడం తప్పా?

ఎన్నటికీ కాదు!

నిశ్చింతగా నిదురపోయాడు ముసలయ్య!!

ఆ మరుసటి రోజు. నాలుగు బారల ప్రొద్దు ఉంటుంది. ముసలయ్య పొలంనుండి తిరిగి వస్తున్నాడు. పేడతట్ట నెత్తిన పెట్టుకొని కామాక్షి గెదురయింది!

'ఏం కామాక్షి!' పలుకరించాడు ముసలయ్య.

దారిప్రక్కకు తొలిగి నిలబడింది కామాక్షి. దారి నిర్మానుష్యంగా ఉంది.

'మూర్తి అంటే నీకిష్టమేనా?'

అడిగాడు ముసలయ్య.

అనుకోకుండా యెదురైన ఈ ప్రశ్నకు మనిషిలో కాస్త భయము, మరికాస్త ఆందోళన, అంతకుమించి ఆశ్చర్యము కలిగిన మాట వాస్తవమైనా వీటన్నిటిని అధిగమించిన అనురాగము ముసి ముసి నవ్వుల రూపాన్ని సంతరించుకోగా ఆనందముతో నిండిన కన్నులు ముసలయ్యను చూడడానికి సిగ్గుపడ్డాయి! తన గుండెల్లో బరువు తీరిపోగా కామాక్షి తలపై బరువు మతికి వచ్చింది ముసలయ్యకు.

'నెత్తిన బరువు పెట్టుకొని నిలబడ్డావే! పద కామాక్షి!' అంటూ ముసలయ్య ముందుకు నడిచాడు ఆలోచనలు అతనికిముందు నడుస్తూ ఉంటే!—

వారం రోజులు తిరుగకముందే ఒక రోజు రాత్రి. రాత్రి రెండుజాములై ఉంటుంది. చిత్తూరు నుండి పిలిపించిన బాడుగ కారు ఊరిబయట నిలబడి ఉంది. అనుకొన్నమేరకు యువజన సంఘ సభ్యుల్లో ముఖ్యుల్లో ఒక్కరొక్కరుగవచ్చి చేరుతున్నారు. మూర్తి కుమారుని ఆనందానికి అవధులు లేవు. కామాక్షిని పిలుచుక రావడానికి నియమితులైన వారి సాయముతో ఆమెకూడ వచ్చిచేరింది. కారు బయలుదేరింది. ఆ మరునాటి ఉదయం కామాక్షి మూర్తి కుమారులు ఆలూమగలైనందుకు ఆనందముతో తిలకించిన యువజనసంఘసభ్యులు...ఆశీర్వదించిన వేంకటేశ్వరస్వామి సాక్షులు!

ఊరు గుప్పుమనింది!

'ఏమే! అలివేలా! యాడైనావుందా యీ యిడ్డూరం! అహా! ఇంక వానలుకురవమంటే కురస్తాయా?'

వాపోయింది గంగక్క.

'ఏమో మీరే చూడండమ్మా! పెద్దోళ్ళ చేస్తే పెరమాళ్ళుచేసినట్టు! ఆమాటనవేల దానికి రెండు రావేల?'

తగిలీతగలకుండ బదులుపలికింది అలిమేలు!

'మా ఎద్దు మంచిది! మా ఎద్దు మంచిది!! అని కొమ్మెత్తి ముక్కులో దోపుకొంటే ముక్కు చినిగిందంట! అట్లుంది గదవ్వా యవ్వారం!'

'అదిగాదులేరా! ఎనుముల మేపుకొనేవాణ్ణి అట్లనే ఉండనిచ్చివుంటే బాగుండేది. నెత్తికెక్కించుకొంటే వాడిఆట వాడు ఆడె!'

ఊళ్లో ఎక్కడచూచిన యీ మాటలే వినిపిస్తున్నాయి!

కామసాని చిన్నసామి కడుపు రగిలిపోయింది!

'నా కడుపున చెడబుట్టావురా! తాతముత్తాతలకాలంనుండి చచ్చిసున్నమై నిలబెట్టిన యింటి గౌరవాన్ని మంటకలిపినావురా? నీకేం పొయ్యేకాల మొచ్చిందో! ఇంతకూ నిన్నని ప్రయోజనంలేదు. ఇదంతా వాడుండ్లా ముసిలిగాడు వాడు చేసినపనిరా! ఆనాడేమో ఎదురులేకుండా అందరు నన్ను ప్రెసిడెంటుగా నిలబెట్టితే పడగొట్టేవరకు మీపాటు చూడలేకపోతిని. ఈనాడేమో నిలువునా నా కొంపనే పడగొట్టిరి!'—ఎదుటపడ్డ కుమారునిమీద వెళ్ళగ్రక్కాడు అక్కసు. ఉలికీపలుకలేదు మూర్తి కుమారుడు ఉగ్రుడైపోయాడు మాజీప్రెసిడెంటు.

'ఒరే! మీయాట మీరాడితే యిక నాయాట కట్టిస్తా చూద్దురు కానీరా! వాడా ముసిలిగాడి అంతు తేల్చకపోతే నా యబ్బకుగాదు నేను పుట్టింది.'

'అంతసులభంగాదులే నాన్నా!'అన్న మాట

నాలుకకొనవరకువచ్చి ఆగిపోతే ముందుకు సాగి పోయాడు మూర్తి!

ఇనప్పెట్టెముందు కూర్చున్నాడు మాజీ ప్రెసిడెంటు! కండ్లు నిప్పులు కక్కుతున్నాయి. కనుబొమలు ముడివడ్డాయి. బయట గాలి ధాటికి కిటికీతలుపులు కొట్టుకొంటున్నాయి. అంతకంటే వేగంగా అతని గుండెలు!...

ఇనప్పెట్టెతలుపులు తెరువబడ్డాయి. ప్రెసిడెంటు తలలో తలపులు తైతక్కలాడుతున్నాయి. ఇనప్పెట్టెనుండి కాగితములకట్ట బయటికివచ్చింది. ప్రెసిడెంటు హృదయకుహరములో వేడినిట్టూర్పు బుసకొట్టింది. కాగితముల కట్టలోని కవర్లు ఒక్కటొక్కటిగ ఆతని చూపులనుండి తప్పు కొంటూ, మరొక కట్టరూపాన్ని సంతరించు కొంటూంటే, ఆ కవరుమాత్రం చేతిలో పట్టు బడింది. బాగా పరికించిచూశాడు. సందేహములేదు. అది సంపతి పరదేసుదే! కవరునుండి కాగితములు బయటికివచ్చాయి. కన్నులు కాగితములను పరిశీ లిస్తూంటే; ఎడమచేయి కుడిమీసాన్ని పరామర్శిం చింది. ఓ వెకిలినవ్వు నాలుగుగోడలమధ్య నలిగి పోయింది!

ఆప్పై కామసాని చిన్నసామి ఆ ఊళ్లో త్రొక్కని కడపలేదు. పలుకరించని మనిషిలేడు. అసలే ఆచారపరాయణులైన ఆ పల్లెల్లో ముస లయ్య చేత, అందరికీ చేదుగనే కనిపిస్తూ ఉంది. దానికితోడు కామసాని చిన్నసామి చెవుల్లో యిల్లు కట్టుకొని సతపోరడం...వారము తిరుగకముందే ఓ రోజు రాత్రి అచ్చుబండవద్ద మద్దిస్తం యేర్పా టయింది.

దాదాపు జాము రాత్రి కావస్తూ ఉంది. చాకలి చెంగయ్య ఒక్కపరుగున యిల్లిల్లూ తిరు గుతూ ఇంటికొక్క మనిషిని రమ్మంటే, ఇంటిల్లి పాది కదలివస్తున్నారు. అచ్చుబండవద్ద జనం కిటకిటలాడిపోతున్నారు ముసలయ్యను పిలుననంపి నారు. అతనివెంట యువజనసంఘ సభ్యులందరూ ఉన్నారు.

'ఏం పరదేసూ? ఊరిమీద వదలడానికికాదు నువ్వు కూతుర్ని కన్నది. నువ్వు దాన్ని కట్టు దిట్టాల్లో పెట్టిఉంటే యిప్పుడీ యిక్కట్టు వచ్చేదికాదు. ఏమంటావ్?'

చేరిన పెద్దమనుష్యులనబడేవారిలో ఒకరి ఆరోపణ.

'దైవసాక్షిగ చెబుతున్నాను. ఈ సంగతి మీకెంత తెలుసో, నాకూ అంతే తెలుసు. మీకంటే నేనే ఎక్కువగా ఉడికిపోతున్నాను. నావల్ల యేతప్పు లేదు.'

పరదేసు విన్నవించుకొన్నాడు.

విన్నపాలు గంగపాలైతే పరదేసును కులానికి వెలివేశారు. చాకలి మంగలి అతని కడప త్రొక్క రాదని శాసించారు. నూరు రూపాయలు తప్పు క్రింద చెల్లించమన్నారు.

'లబోదిబో' అని మొత్తుకొన్నాడు పరదేసు. పట్టించుకొన్నపాపాన పోలేదెవరూ!

'ఏం ముసలయ్యా? నువ్వుచేసినపని యేమైనా బాగుందా? ఈ పాయకట్టులోనివాళ్లరితా దేవుడంటి మనిషని చేయెత్తి దండంపెడుతూంటే నీకెందుకు పుట్టిందయ్యా యీ పాడుబుద్ధి!'

ముసలయ్య విచారణ ఆరంభమయింది!

ముసలయ్య ఏమీ బయలుపలుకలేదు. 'ముస లయ్య తప్పితే ఎవ్వరూ నోరెత్తరాదు'—అని అంతకుమునుపే నిర్ణయించుకొన్న యువజనసంఘం ఊపిరి బరువుగా పీలుస్తూఉంది.

'నువ్వేపనిచేసినా, ఊరిమంచికోసమేనని అను కొంటూఉంటిమి. అందుకే నువ్వు ఆడింది ఆట! పాడింది పాట!......కానీ ముండమొగాన బొట్టు పెట్టడంమాత్రం............'

'అదిగాదు బావా? ఆ అమ్మాయి ముండ

మోసింది నిజమే! కానీ వయసువెల్లికాదు. తన రాత అట్లరాసింది కాబట్టి! పట్టుమని పదహారే ళ్లయినా నిండలేదు. దీనికితోడు చక్కని రూపా న్నిచ్చినాడు ఆ పాడుదేవుడు. దీంతో పదిమందీ ఆమె చుట్టు తిరుగుతారు. వయసు చెడ్డది బావా! ఏవాడో ఒకనాడు పొరపాటుగా కొలుజారితే మిగిలేవి కళ్లల్లో నీళ్లు! అప్పుడు యీ పదిమందిలో ఎవ్వరూ కళ్ల నీళ్లు తుడువలేరు. కాళ్లపై నిలబెట్టలేరు. అదిగాక ఆ ఒక్క అమ్మాయిని గురించి యీ పదిమందీ చెడిన వాళ్లవుతారు. దానికంటే యిది మంచిది గాదా బావా?' నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు ముసలయ్య.

'కళ్లల్లో నీళ్లు తుడువడానికి, వాళ్లపై నిలబెట్టడానికి నాకొడు కొకడే కనిపించాడా? ప్రెసిడెంటయినప్పుడేమో నన్ను, యిప్పుడేమోనా కొంపను మంటగలిపితిరి. సరిపోతుందా?...పాలు అన్నం తినిన పదిమందీ చెప్పండి.'

చిన్నసామి ఆవేశము ఆవిర్లు కక్కుతూ ఉంది.

'మేమెవరినీ పడవేసి పంగనామాలు పెట్ట లేదు. పెట్టినా దాసర్లు కాలేదు. వాళ్లిద్దరూ ఒప్పుకొంటేనే మేము నాలుగు అక్షింతలు వేశాము.'

తనతప్పులేదని ముసలయ్య వాదన.

'పసివాళ్లు... వాళ్ల ఆశలు పుట్టేడు. వాళ్లు ఒప్పుకొంటేమాత్రం మీ బుద్ధి ఏమయిం దయ్యా?'

జీర్ణశక్తి బాగాఉంటే, ఆకలి బాగావేస్తుంది.
పాప ఆరోగ్యంగా ఉంటుంది.
అందాల పాపలకి
అమృతాంజన్
గ్రైప్ మిక్స్చర్



ఇది అమృతాంజన్ లిమిటెడ్ వా
తయారింపే అని గుర్తుంచుకోండి.

DSAGM 1266TEB

పెద్దమనుష్యుల ప్రశ్న.

'వాళ్లీనాడు మీముందున్నారు కాబట్టి యీ మాట అడుగుతున్నారు. మూర్తికి డబ్బు కొదువ లేదని మీ కందరికీ తెలుసు. ఆ అమ్మాయిని వాడు లేవదీసుకపోయి ఉంటే!'

అందరు ఆలోచనలో పడ్డారు. కామసాని చిన్నసామి ఆలోచిస్తున్నాడు. కొడుకు సంగతి తనకు బాగా తెలుసు. అంత పని చేసేవాడే! కాగా ఆలోచనలన్నీ అమ్మాయివైపు మళ్లాయి.

'ఆ అమ్మాయి ఒప్పుకొనిం దంటున్నారు గదా?...ఒప్పుకోకుండా ఉంటే...'

సవాలు చేశాడు కామసాని చిన్నసామి.

అంతవరకు ఎంతో నిగ్రహించుకొంటున్నాడు ముసలయ్య. ఆ మాటలో బాగా రెచ్చిపోయాడు.

'ఇంతవరకు దైవసాదువుగ నేను చేసిన ప్రతి పని మంచిదేనని నాలుగు వీధులు మీసం మెలివేస్తూ తిరిగేవాడిని. ఇప్పుడు ఆ అమ్మాయి ఒప్పుకోలేదంటే నేను చేసింది తప్పే!—ఆ తప్పు నిరూపిస్తే యిదే నాలుగు వీధులు గాడిదమీద ఊరేగి, ఊరు వదలి వెళ్లిపోతాను'

ఆవేశం ప్రతిధ్వనించింది ముసలయ్య మాటల్లో!

అప్పటికే అర్ధరాత్రి దాటింది. మద్దిస్తం మరునాటికి వాయిదాపడింది. తలకొక్కతీరుగ తల పోసుకొంటూ అందరు యింటిముఖం పట్టారు. మాజీ ప్రెసిడెంటుమాత్రం పరదేసును ప్రక్కకు పిలిచాడు. చేయిపట్టి నడిపించుకొంటూ, ఎవరైనా చూస్తారేమోనని దిక్కులు పరికిస్తూ మెల్లగా ఊరుబయట చేరాడు.

'చూడు పరదేసూ! ఈ పనేమైనా బాగుందంటావా?'

ఆరంభించాడు ప్రెసిడెంటు.

'మా యబ్బతో చిన్నబ్బా! నాకేమీ తెలియదు. అది కడపలో అడుగుపెడుతూనే దాని వేషం చూసేసరికి కడుపుమండింది. చావమోదితిని. కడుపు తీపి నీకుమాత్రం తెలియనిదేముంది?'

పరదేసు ప్రాధేయపడ్డాడు.

'ఆ కడుపు తీపితో నేగదయ్యా యీ బాధంతా! ఏదో పిల్లోళ్లు. తెలిసీ తెలియక తప్పుచేసినారు. నా మాట విను. నీ బిడ్డను, నిన్ను కాపాడతా! కులానికి వెలివేసిన సంగతి నే చూసుకొంటాను. ఒక్కమాట చెప్పించు నీ బిడ్డ ఒప్పుకోలేదని!'

ఆలోచనలో పడ్డాడు పరదేసు!

'పరదేసూ! నువ్వు తీసుకొన్న బాకీకిగాను నీ యిల్లు వాకిలితో సహా పొలాన్ని తాకట్టుపెట్టిన సంగతి మరచిపోవద్దు; అయిదేండ్లలోపుగ విడుదల చేసుకోకుంటే ఆస్తిమీద హక్కు నాది అన్న సంగతి నీకు తెలుసు. ఇప్పటికే గడువుతీరి వారం దాటింది. ఈ కార్యం నెరవేర్చకపోతివో నీకు నిలువనీడఉండదు సరిగదా చిప్ప చేతికొస్తుంది! బాగా ఆలోచించుకో!'

హెచ్చరించాడు మాజీ ప్రెసిడెంటు.

గడగడవణకిపోతూఉంటే 'సరే!'అన్నమాట ప్రయత్నపూర్వకంగా వెలువడింది పరదేసునోట. ఇద్దరు విడిపోయారు. నీడలా వెన్నాడిన యువజన సంఘం నిప్పులు కక్కింది!

అప్పటికి కామసాని చిన్నసామి మనసు కుదుటపడింది. కాగా యిల్లుచేరి హాయిగా పవ్వళించాడు. మరుసటిరోజు మద్దిస్తములో ఆ అమ్మాయి తాను ఒప్పుకోలేదని చెప్పడము...ముసలయ్య నాలుగువీధులు గాడిదమీద ఊరేగడము...ఊరు వదలి వెళ్లిపోవడము...సినిమాల్లో బొమ్మల్లాగ కనులముందు మెదలుతూఉంటే కలిగిన పరవశత్వము తొందరలోనే నిద్రరూపాన్ని దాల్చింది.

చిందరవందరగ ఆలోచనలు మనసును చిత్తుచేస్తూఉంటే, అడుగులోఅడుగు వేసుకొంటూ మెల్లిగ యిల్లుచేరాడు పరదేసు. అప్పటికే అర్ధరాత్రి దాటివున్నా, భార్య బిడ్డ తనకోసం యెదురు చూస్తున్నారు. అదివరకే 'అచ్చబండ'వద్ద ముస

లయ్యా నిర్ణయం కామాక్షి చెవిని పడింది. ఆమె గుండెల్లో రాయిపడింది. తండ్రి ఏమంటాడోనని తపించిపోతూంది.

'ఒక్కగా నొక్కబిడ్డవు, నువ్వు పుట్టకుండినా బాగుండునమ్మా! లేదు—వెట్టంతకొడుకు వాడుండి నువ్వుపోయినా, ఈ బాధ తప్పేది!'

వాపోయాడు పరదేసు.

వాస్తవానికి బదులు అవసరం లేకపోయింది.

'మాడు తల్లీ! వీనా యన్నను బ్రదికించుకోవడానికి, నీ పెండ్లికి ఇనా పూరికొంపతో సహా సర్వం తాకట్టుపెట్టి అప్పుతెస్తిని. అయిదేండ్ల లోపుగ విడిపించుకొంటానంటిని. ఈ నాటికే గడువుతీరి వారం అయిందట. మన బ్రదుకులు చిన్నసామి చేతుల్లో యిరుక్కున్నాయి. ఏం చేయాలో తోచడం లేదు. పోనీ! ఈ పెండ్లికి ఒప్పుకోలేదని నువ్వు ఒక్కమాటంటే...'

ఇవి చేతులుకాదు తల్లీ అని చేతులు పట్టుకోపోయాడు పరదేసు. కామాక్షి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. కాసేపు ఆలోచించింది. ఏమనుకొనిందో యేమో? 'సరే!' అనింది. పరదేసు మురిసిపోయాడు. 'నూరేళ్లు పచ్చంగా బదుకు తల్లీ!' అని ఆశీర్వదిస్తూ పడుకొన్నాడు. చిన్నసామి కూతురినికోడలుగా యేలుకోవడము... తనకు అప్పుబాధ తప్పడము...మనసు ఆనందముతో నిండిపోతే హాయిగ కన్ను మూశాడు!

*   *   *

తెల్లవారింది. అది తప్పదు. మునలయ్యా ముభావంగా తిరుగుతున్నాడు. అది గమనించిన ఊరివారు గుసగుసలాడుకొంటున్నారు. యువజన సంఘం ఉడికిపోతూ ఉంది. కామాక్షి లేవిహుషారు తెచ్చుకొనింది. కామసాని చిన్నసామి కనుకొలకుల్లో ఆనందం తొణికిన లాడుతూ ఉంది. దేవితోను నిమిత్తంలేని ప్రొద్దుక్రుంకనే క్రుంకింది. దాదాపు జాము రాత్రి కావస్తూ ఉంది. నడివీధిలో రావిచెట్టుక్రింద 'అచ్చబండ' జనంతో నిండిపోయింది. కామసాని చిన్నసామి, పరదేసు, మునలయ్య, యువజనసంఘం ఉచితాసనాలు అలంకరించారు. చెంగయ్యను పిలిచి కామాక్షిని పిలుచుక రమ్మన్నారు. చెంగయ్య ఆమెకోసం వెళ్లితే అందరు ఎదురు చూస్తూ కూర్చున్నారు.

చెంగయ్య ఒక్కపరుగునవచ్చాడు గసపోసుకొంటూ! ఆ గసతోనే చెప్పలేక చెప్పాడు. కొంప మునిగిందని! ఎంతవేగంగా వచ్చాడో అంతవేగంగానే పరుగెత్తాడు. 'ఏమయిందో యేమో?' అని అందరూ అతని వెంబడి పరుగెత్తారు.

పరదేసుభార్య 'అయ్యో! తల్లీ! ఎంతపని చేస్తివే!' అని మొత్తుకొంటూ చేదబావిచుట్టూ తిరుగుతూ ఉంది.

మూర్తికి మతి తప్పింది. బావిలో దూకపోయేసరికి ఎవరో పట్టుకొన్నారు. ఇంతలో లాంతర్లు తెచ్చారు. బావిలోనికి మొకులు దించారు. ఇద్దరు ముగ్గురు యువకులు గబగబ దారాలమీదుగ దిగి ఎంతో ప్రయాసతో పైకి తేగలిగింది శవాన్ని మాత్రమే!

మొగమునిండను పచ్చగ పసుపు పూసుకొనింది. నుదుట తిలకము తీర్చిదిద్దింది. తల నిండుకు పువ్వులు తురుముకొనింది. కుందనపు బొమ్మ! చెదరీచెదరని అలంకరణతో బొమ్మలాగ పడివుంటే అందరి కడుపులు తరుక్కపోతున్నాయి. మూర్తి నిజంగానే మూర్ఛపోయాడు. అతని సపర్యలో మునిగిపోయింది యువజనసంఘం! కామసాని చిన్నసామి కొడుకుదగ్గర కూర్చుని కుమిలిపోతూంటే, పరదేసు కూతురిపైబడి మొత్తుకొంటున్నాడు.

మునలయ్య కండ్లు వాగులైనాయి. ఆ దారుణాన్ని చూస్తుంటే కడుపులో చేయిపెట్టి దేవినట్లయింది. అక్కడ నిలబడలేక మెల్లిగ బయలు దేరాడు. తలనిండుకు ఆలోచనలు!

'అసలు కామాక్షి గుండెనిబ్బరంకలిగిన మనిషి. మూర్తి మెడలో తాళిగట్టినవాడుకూడ 'ఏం కామాక్షీ?' అంటే 'నువ్వుండగా నాకేం భయం బావా?' అంది. ఊళ్లోకూడ ధైర్యంగానే తిరుగుతూ ఉండింది. ఒకవేళ అమ్మ నాన్నకు ఆస్తి పోతుం దని భయపడిందేమో?...అంతవరకువస్తే తనకు పది కుంటలపొలం ఉంటేగదా?'

రామాలయాన్ని చేరాడు. ఏమీతోచకుండా అరుగుమీద అలా నడుము వాల్చాడు. అలసిపోయిన తనువు...అంతకంటే అలసిపోయిన మనసు...తనకు తెలియకనే కన్నులు మూతలుపడ్డాయి.

'బావా! నాన్న ఆ కర్కోటకుడిదగ్గర అప్పు చేశాడట. అప్పు అయిదేండ్లలో తీరుస్తానన్నాడట. ఇప్పటికే గడువుదాటి వారముంది. ఆస్తిపాస్తులు వాడిచేతుల్లో యిరుక్కపోయాయి. ఈ పెళ్లికి నేనొప్పుకోలేదంటే, ఆస్తి తిరిగి యిస్తానన్నాడట. 'నన్ను రక్షించుతల్లీ!' అని నాన్న చేతులు పట్టు కొని బ్రతిమాలాడు నన్నేం చెయ్యమంటావ్? అటు కనిపెంచినవాళ్లు......ఇటు ఒకదారి చూపించిన నువ్వు? కుమిలికుమిలి ఎటూ తేల్చుకోలేక బావి శరణుజొచ్చాను బావా! పిరికిపందని తిట్టద్దు!'

'కామాక్షీ! కామాక్షీ!!'

'అవును బావా! ఎండిపోతున్నపైరుకు నీళ్లు కట్టితే ఏమవుతుంది. కలుపే ఎక్కువవపడుతుంది. అది తీసేద్దామనుకొన్నావు తీస్తే తరిగేదా అది! ఆలోపుగ పైరే యెండిపోయింది! నాది దరిద్రపు జన్మ బావా! దీనికెందుకు బాధ!'

'ఆఁ!'అంటూ ఎగిరిపడిలేచాడు ముసలయ్య. కల చెదరిపోయింది. కుక్కలు భీకరంగా- మొరుగు తున్నాయి. పరదేసు యింటిలో రోదన సన్నగా విని పిస్తూ ఉంది. ఆ మీదట కన్ను పొడుచుకున్నా కునుకు పట్టలేదు. తనకు తెలియకనే కళ్లల్లో నీళ్లు ఏక ధారగా కారుతున్నాయి. ఆలోచనలు వాటితో పోటీ పడుతున్నాయి.

'అవును. పాపం కామాక్షి! ఏం చేస్తుంది? నిజంచెప్పి తనను రక్షిస్తుందా? అబద్ధంచెప్పి అమ్మను నాన్నను కాపాడుకొంటుందా? ముల్లుమీద అరటాకుపడినా అరటాకుమీదముల్లుపడినా అర టాకే చినుగుతుంది. అట్లనే ఆమె బ్రదుకుకూడ చినిగింది. అయితే ఆమె చావడానికి కారణం మాత్రం తానే అంటారు అందరు! అంతవరకు చేయెత్తి దండంపెట్టినవారే వేలెత్తి చూపుతారు.'

'నేనేం తప్పు చేశాను సామీ! నాకెందుకీ శిక్ష!' రాముడిముందు నిలబడి బ్రతిమలాడాడు ముసలయ్య.

ఏమీ జరుగనట్లు, తనకేమీ తెలియదన్నట్లు నిరామయంగా చిరునవ్వులు చిందబోస్తున్నాడు రాముడు. కడుపు రగిలిపోయింది. కుప్పగ కూలి పోయాడు!

'కడప కడప తిరిగి అడుక్కునే వాడివి! కడుపున పెట్టుకొని కాపాడిందే యీ పల్లె. దానికి నువ్వు చేసిందేమి? ఇంతమంది కష్టపుమంట పెట్టుకోవడమా? ఛీఛీ!' ఊరు ఊరంతా ఒక్కటై నిలబడింది. కొందరు చీదరించుకొంటున్నారు. కొందరు తిడుతున్నారు. మరికొందరు అదో విధంగా చూస్తున్నారు తనవైపు! మనసులోని ఆందోళన దృశ్యరూపాన్ని సంతరించుకొని కనులముందు మెది లితే, కంపించిపోయాడు ముసలయ్య. కళ్లల్లో నీళ్లు ఆగనే లేదు!

'నేనిక బ్రతకలేను. బ్రదికి మొగమెత్తుకొని తిరగలేను!'

ముసలయ్య నోట బరువుగా వెలువడ్డ మాట లను రాముడైనా విన్నాడో లేదో పాపం!

ఒక్కక్షణం నిలబడలేకపోయాడు.

రాత్రి మూడుజాములు ముగిసింది. ఆ ఊరి రైతాంగము పనిపాటకొరకు ఆయత్తమవుతూ ఉంది. అయితే, రామాలయం అరుగుమీద రోజూ వినిపించే తత్వాలు ఆ రోజు వినిపించలేదు. అంతవరకు అవకాశంకోసం ఎదురుచూస్తుండిన ఆ ఊరికోళ్లు ఆనాడు రెక్కలు తట్టుతూ చూశాయి ఏనాటికైనా జయం మాదే అన్నట్లు!

ఆ రోజుకూడ తెల్లవారింది, అది తప్పదు కాబట్టి!